# హెల్ప్ మీ... డాక్టర్!

-అర్చనా చౌహాన్

## సూర్యోదయం అవుతోంది.

మరో అందమైన రోజుకు స్వాగతం పలుకుతూ ప్రకృతి ఆహ్లాదకరంగా, తేటగా, తాజాగా ఉంది. సూర్యుని ఆగమనాన్ని పసికట్టి చీకటి హడావిడిగా పారిపోయింది.

అప్పటి వరకూ చీకటి ముసుగులో నలుదిక్కులా వ్యాపించిన సన్నని మంచుపొర ఈ హఠాత్పరిణామానికి విస్తుపోయి, సూర్యకిరణాల వేడికి తాళలేక బాధగా విలపించింది.

ఆ కన్నీరు ఆకులపై చేరి మంచు బిందువులుగా మారే సరికి విజయగర్వంతో సూర్యుడు పూర్తిగా వెలికి వచ్చాడు.

ఎ బ్రైట్ న్యూ డే స్టార్ట్స్!

ఆ విషయం గుర్తు చేద్దామని అలారం గయ్యిన మొత్తుకుంది. రాత్రంతా ఆలోచనల్తో నిద్రపట్టక ఏ తెల్లవారు ఝామునో కలతనిద్రలోకి జారుకున్న స్మృతి ఆ శబ్దానికి ఉలిక్కిపడిలేచి కూర్చుంది.

"ఛీ! వెధవ గడియారం తీసి అవతల పడేస్తే పీడా పోతుంది" కసిగా తిట్టుకుంది.

క్రితం రాత్రి అలారం పెట్టింది తనే అన్న సంగతి ఆమెకు ఆ క్షణంలో గుర్తురాలేదు.

నైటీ సరిచేస్కుంటూ బాల్కనీలోకి వచ్చి నించుంది.

క్రితం రాత్రి నిద్రపోయేముందు తను ఏ విషయం గురించి ఆలోచించీ... చించీ బుర్రపాడు చేస్కుందో, అదే విషయంకళ్ళు తెరవగానే మళ్ళీ మదిలో మెదిలింది.

అన్యమనస్కంగా, అసహనంగా బాల్కనీలో నిల్చుని ఉన్న ఆ అమ్మాయికి, తల్లిలేని లోటు ఆరోజు బాగా తెలిసొచ్చింది.

తనకి అమ్మ ఉండి ఉంటే తన సమస్య పరిష్కారం చెప్పగలిగేదేమో! బామ్మకయితే త చెప్పింది అసలు అర్థమే కాలేదు.పైగా ఇంకోసా అలాంటి మాటలు మాట్లాడొద్దని గట్టిగా వార్ని ఇచ్చింది.

స్మృతికి ఏడాది వయస్సున్నప్పుడే వాళ్ళమ్మ బ్ర క్యాన్సర్‌తో మరణించింది. 'మళ్ళీ పెళ్ళి చేసుకోన అని మంకుపట్టు పట్టిన కొడుక్కి నచ్చ చెప్పలే స్మృతి వాళ్ళ నానమ్మ తనే స్మృతిని పెంచే బాధ్యత తీసుకుంది.



ప్రస్తుతం స్మృతి గ్రాడ్యుయేట్. ఆమె కొరకు పెళ్ళి సంబంధాలు చూడ్డం కూడా మొదలెట్టారు. ఆ రోజు స్మృతికి మొట్టమొదటి పెళ్ళిచూపులు!

అబ్బాయి ఐ.ఐ.టి. ఖాన్పూర్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. బుద్ధిమంతుడు. మంచి సాంప్రదాయం కల కుటుంబం! అమ్మాయి నచ్చితే చాలట! పాలరాతి బొమ్మ లాంటి స్మృతి నచ్చక ఎంచేస్తుంది? 'ఈ సంబంధం ఖాయం!' అని మధ్యవర్తి నొక్కి చెప్పాడు.

కాని స్మృతిలో తనకు మొట్టమొదటి పెళ్ళి చూపులు అన్న ఎక్సైట్‌మెంట్ ఏమీ లేదు. దానిక్కారణం ఆమెను కొద్ది రోజులుగా పట్టి పీడిస్తోన్న అనుమానం!

కొద్ది రోజుల క్రితం స్మృతి ఎక్కడో చదివింది.

'బ్రెస్ట్‌లో ఏమైనా లంప్స్‌లాంటివి తగిలితే అది బ్రెస్ట్ క్యాన్సర్ కావచ్చు, వెంటనే డాక్టర్ని కలవండి' అని.

తనని తాను పరీక్షించుకున్న స్మృతి చేతికి నిజంగానే గడ్డల్లాంటివి తగిలాయి. అంతే స్మృతి ఠారెత్తిపోయింది.

తన తల్లికి ఉన్న జబ్బు వంశపారంప ర్యంగా తనకి కూడా సంక్రమించిందేమో అన్న అనుమానం ఆమెలో రోజు రోజుకీ పెరిగిపోయింది. అలాంటి సమయంలో పెళ్ళి చూపులు అనేసరికి ఆమె ఆందోళన మరింత ఎక్కువయింది.

ప్రస్తుతం ఇవే ఆలోచనల్తో స్మృతి సతమత మవుతోంది. సాయంత్రం పెళ్ళి చూపులని తల్చుకుంటే ఆమె గుండె గుభేలుమంటోంది.

ఉన్నట్టుండి స్మృతికి ఓ మెరుపులాంటి ఐడియా వచ్చింది. తన క్లోజ్‌ఫ్రెండ్ దివ్య దగ్గరికెళ్ళి, అక్కణ్ణించి ఏ లేడి డాక్టర్ వద్దకో వెళ్ళి చెకప్ చేయించుకుంటే సరిపోతుంది. ఈ ఆలోచనలు రావడం ఆలస్యం లేడికి లేచిందే పరుగులా వెళ్ళి చకచకా తయారయింది.

గంధం రంగు షిఫాన్ చీర, అదే రంగు జాకెట్టు, దాదాపు ఆమె రంగులో కలిసిపోయాయి. మాట వినని అల్లరి ముంగురులు, ముద్దు మోముపై తుంటరిగా కదలాడుతున్నాయి.

పర్సు తీసుకుని చెప్పుల్లోకి కాళ్ళు దూరుస్తూ "బామ్మా! నేను దివ్యా వాళ్ళ ఇంటికెళ్తున్నా!" అరిచి మరో మాటకి అవకాశమివ్వకుండా బయటికి తుర్రుమంది.

ఆమె అదృష్టం కొద్దీ త్వరగానే బస్సు దొరికింది. తీరా బస్సెక్కి తీరిగ్గా కూర్చున్నాక గాని గుర్తు రాలేదు. ఆమెకి అంతకు ముందు రోజు దివ్య ఊరెళ్తున్నానని ఫోన్ చేసిన విషయం... గుర్తొచ్చాక తలబాదుకుంది.

"అరె! తనెలా మర్చిపోయింది?" తనని తాను తిట్టుకుంది.

ఇంకేముంది తిరుగు బస్సు పట్టుకుని ఇంటికి వెళ్ళడం బెస్ట్ అనుకుని కనపడ్డ స్టాపులో దిగేసింది. ఆ ఏరియా స్మృతికి అపరిచితం! ఆటో తీసుకుంటే మంచిదని అటూ ఇటూ చూసిన స్మృతిని ఓ బోర్డు ఆకర్షించింది.

"డా॥ చింతామణి. గైనకాలజిస్టు."

బోర్డుమీద క్లుప్తంగా డాక్టర్ గారి కన్సల్టింగ్ అవర్స్ రాసి ఉన్నాయి. చూస్తే డాక్టర్ గారి రెసిడెన్స్ కం క్లినిక్‌లా ఉంది. విశాలమైన అందమైన ఇల్లు, ఇంటి ముందు చిన్న తోటా ఉన్నాయి. గేటు తీసుకుని స్మృతి మెల్లిగా లోనికెళ్ళింది.

బయట డ్రైవర్ కాబోలు,కారు తుడుస్తున్నాడు.

"ఎక్స్‌క్యూజ్ మి!"

స్మృతి గొంతువిని అతను నిరాసక్తంగా తలెత్తాడు.

"డాక్టర్ గారున్నారా?"

"ఉన్నారమ్మా. వెళ్ళండి" అతను తలుపుకేసి చూపించి మురికి నీళ్ళ బకెట్ తీసుకుని వెనుక వైపుకి వెళ్ళి పోయాడు.

ఇహ చేసేదేమిలేక లోపలికెళ్ళింది స్మృతి. అక్కడ వెయిటింగ్ రూమ్ అని రాసుందిగాని అక్కడెవరూ వెయిట్ చేయట్లేదు. ఎదురుగా కన్సల్టింగ్ రూమ్ ఉంది. ఎక్కడా ఎలాంటి అలికిడి లేదు.

"ఇంత పూర్ ప్రాక్టీసేంటో డాక్టరుగారుకి" స్మృతి సానుభూతిగా అనుకుంటూ అక్కడే ఓ కుర్చీలో కూర్చుంది.

ఆమెకు చాలా అసహనంగా ఉంది. అసలే ఆమెకు ఓపిక తక్కువేమో.. కొంచెం సేపుకూడా స్థిమితంగా కూర్చోలేకపోతోంది.

వెళ్ళి కన్సల్టింగ్ రూమ్ డోర్ తెరిచి చూసింది. ఎవరూ కన్పించలేదు. ఇంకొంచెం లోపలికి వెళ్తే డాక్టర్ ఛైర్‌లో ఓ మనిషి కన్పించాడు. అలికిడి విని అతను తలెత్తాడు.

"యెస్?" అతని గొంతు గంభీరంగా ఉంది.

అతణ్ణి చూసి స్మృతి నోటిమాట రాకుండా నిల్చుండి పోయింది, చింతామణి అన్న పేరు చూసి తను లేడీ డాక్టర్ అనుకుంది.

అతనో యువకుడు! పట్టుమని పాతికేళ్ళుండవు! మనిషి కూర్చున్నాక కూడా మంచి పొడగరని తెలుస్తోంది. కండ పుష్టి గల శరీరం, షార్ప్ ఫీచర్స్!

ఒక్కమాటలో చెప్పాలంటే డాక్టరులా లేడు. మంచి స్పోర్ట్స్‌మెన్‌లా ఉన్నాడు.

అసలే నెర్వస్‌గా ఉన్న స్మృతి అతణ్ణి చూసి మరింత నెర్వస్ అయిపోయింది. అతనింకా ప్రశ్నార్థకంగా ఆమెనే చూస్తున్నాడు.

ఉన్నట్టుండి అతను ముందుకి వంగి ఆశ్చర్యంగా "మీరా?" అన్నాడు.

"ఏంటి?" స్మృతికేమీ అర్థం కాలేదు.

అతనో క్షణం ఆమెకేసి వింతగా చూసి ఏదో అర్థమైనట్లు తల ఆడించాడు.

"సారీ! మీరు మీరా అనుకున్నాను."

"వ్వాట్?" స్మృతి మరింత కన్ఫ్యూజ్ అయిపోయింది.

"మీ పేరు 'మీరా' అనుకున్నాను." అతను ఎక్స్‌ప్లెయిన్ చేశాడు.

"ఓ!" అంది స్మృతి. ఆమెకింకా అతని రియాక్షన్ గమ్మత్తుగా అన్పించింది.

"కూర్చోండి." అతనన్నాడు.

"ఫర్లేదండి! నేను వెళ్తాను." స్మృతి వెళ్ళటానికని తలుపుకేసి కదిలింది.

"అయ్యయ్యో! కూర్చోండి. కూర్చోండి." అతను కంగారుగా, దాదాపు అరిచినట్టుగా అన్నాడు.

స్మృతి బిత్తరపోయింది. బహుశా తనే అతనికి లేకలేక దొరికిన పేషెంట్ కాబోలు.

"మళ్ళెప్పుడైనా వస్తానండీ" సర్ది చెప్పబోయింది.

"భలేవారే. ఇంత దూరమొచ్చి వెళ్ళిపోతానంటారేంటి. మీరు కూర్చోండి.. చెప్తాను."

అతనేదో చుట్టంతో మాట్లాడుతున్నట్టు మాట్లాడుతున్నాడు. అతను ఛైర్‌లోంచి లేచి నిలబడి ఉన్నాడు. తను కాదూ కూడదు అని వెళ్ళటానికి ప్రయత్నిస్తే వెనకాల పరిగెత్తివచ్చేట్టున్నాడు.

చచ్చినట్టు కూర్చుంది. అతను కూడా కూర్చున్నాడు.

"డా॥ చింతామణి అంటే మీరేనా?" అనుమానంగా అడిగింది, అంత పాత చింతకాయ పచ్చడి లాంటి పేరు అతనికెలా ఉంటుందని.

"ఆఁ!" అతను క్షణం ఉలిక్కిపడి, "అవునవును" అన్నాడు.

"మీ ప్రాబ్లం చెప్పండి." క్యూరియస్‌గా అడిగాడు.

స్మృతి ఎలా చెప్పాలా అని ఆలోచిస్తూ కూర్చుంది.

"చెప్పండి" అతను మృదువుగా ఎంకరేజ్ చేశాడు.

తన దగ్గర ఎక్కువ టైమ్‌లేదు. ఏదో ఒకటి తొందరగా తేలిపోతే బావుంటుందని ఆలోచించి స్మృతి ధైర్యం కూడగట్టుకుంది.

ఓసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని...

"డాక్టర్! ఐ థింక్ ఐ హేవ్ బ్రెస్ట్ క్యాన్సర్." చెప్పేసింది.

అతను షాక్ తిన్నట్టున్నాడు. మొహం మీద ఎక్స్‌ప్రెషన్ని బట్టి చెప్పొచ్చు.

ఆమెకేసి తీక్షణంగా చూడ్డం మొదలెట్టాడు. అతని వాలకం చూస్తే స్మృతికి తనది అంటు రోగమేమో, ఇంకాసేపుంటే అతను లేచి పరిగెత్తాడేమో అన్పించింది.

"అసలు మీకీ అనుమానం ఎలా వచ్చింది?" అతనింకా ఆమె వైపు అదోలా చూస్తున్నాడు.

స్మృతి తను మెగజైన్‌లో చదవడం, ఆ తర్వాత తనని తాను చెక్ చేసుకోడం గురించి చెప్పింది.

"ఓహ్! మెగజైన్‌లో చదివా మీకా అనుమానం వచ్చింది" అతను చాలా రిలీఫ్‌గా అన్నాడు.

"ఇటొచ్చి కూర్చోండి" తన పక్కనే ఉన్న స్టూల్‌ని చూపించి అన్నాడు.

స్మృతి వెళ్ళి అటువైపున్న స్టూల్‌మీద కూర్చుంది. అతను ముందుగా ఆమె కళ్ళని పరీక్షించాడు. ఆ తర్వాత ఆ చెంప మీద ఓ పదిసార్లూ, ఈ చెంపమీద ఓ పదిసార్లూ టపా టపా కొట్టాడు.

"ఊఁ! ఇప్పుడు నోరు తెరవండి" అన్నాడు.

వీటన్నిటికీ బ్రెస్ట్ క్యాన్సర్‌కీ సంబంధమేంటో స్మృతికి అర్థమవలేదు. అయినా మారు మాట్లాడకుండా నోరు తెరిచింది.

"ఇంకాస్త" అన్నాడు.

ఇంకొంచెం నోరు తెరిచింది స్మృతి.

"ఇంకాస్త!"

స్మృతి నోరంతా కప్పలా తెరిచింది.

"చాల్లే! నోర్మూయ్యి!" దాదాపు కసిరినట్టే సడెన్‌గా అన్నాడు.

స్మృతి విస్తుపోతూ నోర్మూసుకుంది. డాక్టరు గారి వాలకం ఆమెకి అట్టే నచ్చలేదు.

"ఓ.కే! ఇప్పుడు మీరు ఆ బ్లౌజు కాస్త తీయండి. నేను చెకప్ చేసి మీ అనుమానం సంగతి తేలుస్తాను" అతను చాలా కూల్‌గా చెప్పాడు.

స్మృతి గుండె దడదడలాడింది. అతను చెప్పింది అర్థమవగానే చప్పున ఏమనాలో ఆమెకు తోచలేదు. అలాగే కదలకుండా కూర్చుంది. ఆమె హెసిటేషన్ అర్థమయింది కాబోలు...

"చూడండి! డాక్టర్ల దగ్గరా, లాయర్ల దగ్గరా సిగ్గుపడ్డే పనవదు. మీకు బ్రెస్ట్ క్యాన్సర్ ఉన్నదీ, లేనిదీ చెకప్ చేస్తేగానీ చెప్పలేను. నేను గైనకాలజిస్టుక్కని, నా పేషెంట్స్ చాలా మట్టుకు ఆడవాళ్ళే! సో యు సీ ఫిమేల్ అనాటమీ నాకేమీ కొత్త కాదు. ప్రస్తుతం మీరు నా పేషెంట్ కాబట్టి మీరు మరోలా ఫీలవద్దు. ఇట్స్ జస్ట్ ప్రొఫెషనల్!"

అతను కుర్చీలో వెనక్కి ఆనుకుని, మొహమ్మీద ఓ గ్రిమ్ ఎక్స్‌ప్రెషనేసుకుని లెక్చర్ దంచేస్తున్నాడు.

అతని మాటలు వింటే స్మృతికి తన మీద తనకే అసహ్యమేసినంత పనయింది.

ఆఫ్టరాల్ ఏ డాక్టర్ ఇజ్ ఎ డాక్టర్! ఏదో యంగ్‌గా, డాషింగ్‌గా ఉన్నంత మాత్రాన అతను డాక్టర్ కాకుండా పోతాడా.. తనని తాను పలువిధాలా సర్దిచెప్పుకుని ధైర్యం తెచ్చుకుంది. వణుకుతోన్న చేతుల్ని అదుపులోకి పెట్టుకోడానికి ట్రై చేస్తూ మెల్లిగా పైట పిన్ను తీసింది.

షిఫాన్ పైట సర్రున జారి ఆమె ఒడిలోకి పడింది. ఆమె చర్యకి కుర్చీలో క్యాజువల్‌గా వెనక్కివాలి కూర్చున్నతను కాస్తా నిటారుగా కూర్చున్నాడు. ఆమె చేయి నెమ్మదిగా బ్లౌజ్ హుక్స్‌మీద పడింది.

ఒకటి.....

రెండు.....

మూడు.....

అతను పెదాలు బిగపట్టి, ఉద్వేగంగా చూస్తున్నాడు.

స్మృతి చేయి ఎంతగా వణికిందంటే ఇహ ఆమె వల్ల కాలేదు. చెకప్ వద్దూ, పాడూ వద్దూ అని అనుకుంటూండగానే అతను ముందుకి వంగి ఆమె చేతిని పట్టుకుని.

"చూడండి! నేను...." అని ఇంకా ఏదో అనబోయేంతలో బయట అడుగుల శబ్దం వినిపించింది.

అతను దూరంగా జరగడం, స్మృతి పైట కప్పుకోడం, బయట తలుపు తీసుకుని ఓ ప్రౌఢ మహిళ లోపలికి రావడం ఒకేసారి జరిగాయి. వచ్చినావిడ అతణ్ణి చూసి...


"సందీప్! నీకెన్నిసార్లు చెప్పాలి అలా డాక్టర్ చైర్‌లో కూర్చోవద్దని?" మురిపెంగానే కసిరింది.

"సారీ ఆంటీ!" అతను చేతులు పైకెత్తి కుర్చీలోంచి లేస్తూ అన్నాడు, "మీ కోసం... పేషెంట్!" స్మృతికేసి చూపిస్తూ స్మృతి వైపు ఓ కొంటెచూపు విసిరి బయటికి వెళ్ళి పోయాడు.

ఆవిడ అతను వెకేట్ చేసిన చైర్‌లో కూర్చుంది.

"చెప్పమ్మా! ఏంటీ ప్రాబ్లం?" ఆవిడ స్టెతస్కోప్ డెస్క్‌లోంచి తీస్తూ అడిగింది.

"మీరు..." స్మృతి అనుమానంగా, భయంగా అడిగింది.




వి.బాలాజి, కార్టూనిస్ట్, కురబలకోట - 517 350, జిల్లా: చిత్తూర్

"ఐయామ్ డా॥ మణి" ఆవిడ తనని తాను పరిచయం చేస్కుంది. స్మృతి స్టన్ అయిపోయింది.

ఆమె కనలు ఒక్క క్షణం ఏంచేయాలో పాలుపోలేదు. ఆవిడ మళ్ళీ అడగడంతో, యాంత్రికంగా తన ప్రాబ్లం చెప్పింది. స్మృతి చెప్పింది విన్న ఆవిడ చిన్నగా నవ్వింది...

"మీ అమ్మగారికి బ్రెస్ట్ క్యాన్సర్ ఉన్నంత మాత్రాన, మీకూ అదొస్తుందనే రూలేం లేదు. ఇట్స్ నాట్ హెరిడిటరీ! అదీ ఈ వయసులో బ్రెస్ట్ క్యాన్సర్ చాలా రేర్! ఆఫ్‌కోర్స్ ఛాన్సెస్ లేవని అంటంలేదు. కానీ, ఎనీవే నిన్ను నీవు ఎలా చెక్ చేస్కున్నావు?" ఆవిడ చాలా ఫ్రెండ్లీగా అనిపించింది.

స్మృతి తను ఎలా చెక్ చేస్కుందో చెప్పింది. ఆవిడ మళ్ళీ చిన్న స్మైల్ ఇచ్చింది.

"అందుకే మిడి మిడి జ్ఞానం పనికిరాదనేది. నువ్వు ఆ పత్రికల్లో ఇచ్చిన మాటర్ సరిగ్గా చదివుండవు. బ్రెస్ట్ క్యాన్సర్ ఉన్నదీ లేనిదీ కూర్చుని కాదు, వెల్లకిలా పడుకుని చూసుకోవాలి. అదీ వేళ్ళతో కాదు, అరచేత్తో.'

తను చెప్పింది డెమాన్‌స్ట్రేట్ చేయటానికి ఆవిడ స్మృతిని బల్లమీద వెల్లకిలా పడుకోబెట్టి అరచేతితో మృదువుగా చెకప్ చేసింది. ఆ చెకప్‌లో గొప్ప విషయం ఆమె స్మృతిని బ్లౌజ్ తీయమని అడగలేదు.

"నీ చేతికి తగిలింది లంప్స్ కావు. నోడ్యుల్స్! టీన్స్‌లో ఉండే అమ్మాయిలకి ఇవి మామూలే. కొన్ని రోజుల్లో అవేపోతాయి. ఓవేళ నీకింకా అనుమానం ఉంటే ఫర్లేదు! ఎక్స్‌రే, స్కానింగ్ చేయిద్దాం. కానీ నా ఉద్దేశ్యంలో అవన్నీ అనవసరం. అయినా రేపు మీ పెద్దాళ్ళ నెవరినైనా తీసుకురా చూద్దాం." అంది డా॥ మణి.

స్మృతి బుర్రకి ఆవిడ చెప్పినవేవీ ఎక్కలేదు. ఆమెకి కోపం, అవమానం కలగలిపిన ఒకలాంటి భావనతో ఒళ్ళంతా దహించుకుపోతోంది.

ఆ భావనలో ఆమె క్యాన్సర్ సంగతి కూడా మర్చిపోయింది. ఎలా ఫీజు చెల్లించిందో ఆటోలో ఎలా ఇల్లు చేరిందో తెలీలేదు. అనుక్షణం డాక్టర్ని అంటూ పోజు ఇచ్చిన ఆ సందీప్ గుర్తుకు వస్తున్నాడు.

అసలతను ఎం చేద్దామనుకున్నాడో స్మృతికి అర్థం కాలేదు.

బట్టలన్నీ తీయించి.. ఆ తర్వాత చెప్దామనుకున్నాడా లేక ఇంకేం చేయాలనుకున్నాడో మరి. వెధవ! ఒంటరిగా ఆడపిల్ల కనిపిస్తేచాలు, అర్థమైన వెధవలందరికీ చులకన అయిపోతుంది.

అతణ్ణి రోజంతా తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టరాని తిట్లన్నీ తిట్టింది. 'ఎక్కడైనా, ఎప్పుడైనా కన్పించక పోతాడా, వాడి భారతం పట్టకపోతానా' అని మనసుకు నచ్చచెప్పుకుంది.

స్మృతికి ఆట్టే ఎదురు చూడాల్సిన అవసరం రాలేదు. సాయంత్రం పెళ్ళి చూపుల్లో అబ్బాయి వైపు ఓరగా చూసిన స్మృతి డంగైపోయింది.

అతనే సందీప్! సందేహం లేదు. ఆ వెధవ చిర్నవ్వే అతణ్ణి పట్టిస్తోంది. స్మృతి మనసు కోపంతో కుతకుతలాడింది.

ఇంతలో అతను స్మృతితో ఒక్క నిమిషం మాట్లాడతానని అన్నట్టున్నాడు. అంతా వీళ్ళిద్దర్నీ గదిలో వదిలేసి బయటి వైపుకి వెళ్ళారు.

ఏదైనా అందితే అతని మీదికి విసురుదాం అన్నట్టు స్మృతి అటూ ఇటూ చూసింది. ఛ! ఏమీ దొరకలేదు.

ఇంతలో అతను గొంతు సవరించుకుని. "చూడండి! మీరు నన్ను ఓ పెద్ద ఇడియట్ అనుకుంటున్నారేమో. కాని నేను చాలా బుద్ధిమంతుణ్ణినిజంగా నిజం. ఉదయం మిమ్మల్ని ఎందుకలా ఫూల్ చేశానని అంటారా? మీ ఫోటో నేను ముందే చూశాను. మీరు నాకు చాలా నచ్చారు. ఆ విషయం మధ్యవర్తికి ఎప్పుడో చెప్పాను. ఉదయం మీరు క్లినిక్‌కి రాగానే మిమ్మల్ని గుర్తు పట్టాను కాని మీకు నేను తెలీదని అర్థమయింది. ఏదో ఊరికే మిమ్మల్ని ఆట పట్టిద్దామని అలా చేశానే తప్ప మరో ఉద్దేశ్యంతో కాదు. హోప్ యు అండర్‌స్టాండ్!" అన్నాడు.

"ఇది బుద్ధిమంతుల లక్షణమా? అసలు మీరు ఏం చేద్దామని అనుకున్నారు?" స్మృతికి కోపం ఆగలేదు, మొహమంతా ఎర్రగా కందింది.

"ఏమీ అనుకోలేదు. ఆంటీ రావడం ఆలస్యమై ఉంటే-నేను మీకునిజం చెప్పేసేవాణ్ణి." అతను తొణక్కుండా జవాబిచ్చాడు.

స్మృతికి ఇంకేమనాలో తోచలేదు. సడెన్‌గా ఆమెకి గుర్తు వచ్చి...

"మీరా ఎవరు?" టక్కున అడిగింది.

"మీరా ఎవరు?" అతను కూడా అయోమయంగా అడిగాడు.

"క్లినిక్‌లో నాపేరు మీరా అని అడిగారు." గుర్తు చేసింది.

"ఓ అదా! ఎదురుగా 'మీరు' కన్పించే సరికి-సర్‌ప్రైజయి నా నోటంట ఆ మాట వచ్చింది అంతే. నాకే మీరా తెలీదు" అతను నవ్వి బదులిచ్చాడు.

కాసేపు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. తర్వాత అతనే లేచి నిలబడ్డాడు.

"ఐయామ్ వెరీ సారీ!" సాఫ్ట్‌గా చెప్పాడు.

"ఇట్సాల్ రైట్" స్మృతి ష్రగ్ చేసింది.

"మరి మీ సమాధానం? ముహుర్తాలు పెట్టించమని చెప్పమంటారా?"

స్మృతి ఓ క్షణం అతని కేసి పరీక్షగా చూసింది. ఆ తర్వాత చిన్నగా నవ్వి "సరే!" అంది.


అతని మొహంలో సంతోషం కన్పించింది. హుషారుగా బయటికి వెళ్తున్న వాడల్లా ఆగి వెనుదిరిగి

"అయ్యో! మర్చిపోయాను" అన్నాడు.

"ఏంటీ?" స్మృతి ప్రశ్నార్థకంగా చూసింది.

"మీకు బ్రెస్ట్ క్యాన్సర్ లేదట. ఆంటీ చెప్పారు." అల్లరిగా నవ్వుతూ బయటికి వెళ్ళిపోయాడు.

స్మృతి కూడా చిన్నగా, సిగ్గుగా నవ్వుకుంది!★




చలపాక ప్రకాష్, పి.ఎ.మార్కెట్, షాప్‌నెం.61, జెండావీధి,విజయవాడ - 520 001.